క్లుప్తంగా

నూతన డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని

సంగారెడ్డి టౌన్ : బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చట్టాలతో నూతన సంవత్సర డైరీని రూపొందించడం అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర అన్నారు. సోమవారం జిల్లా కోర్టులో డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం డైరీని ఇలాగే రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రాయికోడ్(అందోల్): మండలంలోని ఒక్కో గ్రామ పంచాయతీలో కనీసం 30 మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్ ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.1.50 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. గ్రామాల్లో నర్సరీల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. అందుకు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు సమష్టిగా పని చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ రమేష్‌కుమార్, ఈసీ విష్ణువర్ధన్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కేతకీ ఆలయ ఈఓగా శివరుద్రప్ప



బాధ్యతలు స్వీకరిస్తున్న శివరుద్రప్ప

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయ ఈఓగా శివ రుద్రప్ప నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు పూజలు నిర్వహించి, బాధ్యతలు స్వీకరించారు. ఆలయ అర్చకులు, అధికారులు పూలమాల, శాలువాతో సన్మానం చేశారు.

కల్వర్టు పనులు ప్రారంభం



జహీరాబాద్ టౌన్: సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి చొరవతో పట్టణంలోని 16వ వార్డులో కల్వర్టు పనులను సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని శ్రీరాంవీధిలో కల్వర్టు లేక మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ ప్రజలు రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన మున్సిపల్ అధికారులతో మాట్లాడి కల్వర్టు పనులను ప్రారంభించారు. దీంతో కాలనీ ప్రజలు గిరిధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లైఓవర్‌కు ఫరీదొద్దీన్ పేరు పెట్టాలి



వినతిపత్రం ఇస్తున్న మైనార్టీ నాయకులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జికి మాజీ మంత్రి స్వర్గీయ ఫరీదొద్దీన్ పేరు పెట్టాలని మైనార్టీ నాయకులు సోమవారం కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ ఉజ్వల్ రెడ్డిని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఫరిదొద్దీన్ సర్పంచ్‌గా, డ్రైవర్ యూనియన్ నాయకుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించి రాష్ట్ర మంత్రిగా ప్రజలకు సేవలు చేశారన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు సేవలను అందించారని, ఆయనకు అజాత శత్రువుగా గొప్ప పేరుందన్నారు. కావున ఫ్లైఓవర్ బ్రిడ్జికి ఆయన పేరు పెట్టాలని కోరారు.

గ్రామాలు.. మురికి కూపాలు

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు విపరీతంగా పెరిగి గ్రామస్తులు టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల పాల వుతున్నారు. అధికారులు స్పందించి మురికి కాల్వలు, పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



మెదపల్లి గ్రామ శివారులో రోడ్డు పక్కన డంప్ చేసిన చెత్త

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని గ్రామాలు మురికి కూపాలుగా మారాయి. నెలలు తరబడి పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో మురికి నీటి కాల్వలు నిండి రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రజలు టైఫాయిడ్, మలేరియా, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు గ్రామాల్లో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించాలని ఆదేశాలున్నా పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లో వేయాలి. అవేమీ పట్టించుకోకుండా రోడ్డుపక్కనే వేసి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో రోడ్డు పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని మెదపల్లి గ్రామ శివారులో ఉన్న చెక్ డ్యామ్ ఎదుట చెత్తను వేస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈదులపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో మురికి కాల్వ నిండి రోడ్డుపై ప్రవహిస్తుంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకొని ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టి, చెత్తను డంపింగ్ యార్డ్‌లో వేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఈదులపల్లి గ్రామ శివారులో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

వట్‌పల్లి(అందోల్): పేద విద్యార్థులకు అండగా ఉంటామని అందోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004–2005 బ్యాచ్ ఎస్ఎస్‌సీ పూర్వ విద్యార్థులు తీర్మానించారు. సోమవారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలుసుకొని సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గత ఇరవై ఏళ్లలో మృతి చెందిన నలుగురు పూర్వ విద్యార్థులను స్మరించుకుంటూ వారి ఆత్మకుశాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించి వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ సుగ్రీవుడు ముదిరాజ్, సాయిబాబా, పడిగల శివ, శేఖర్, అనిల్, గంగారాం, నాగరాజు, నరేందర్, సత్యనారాయణ, విజేందర్, శంకర్ గౌడ్, ఇమామ్ అలీ, సాయి, యాదయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నిజాంపూర్ గ్రామ శివారులోని మామిడి, సపోట, జామ, కొబ్బరి, నిమ్మ తోట, వరి పొలాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు పోట్రు రామకృష్ణ పండ్ల మొక్కల ఉపయోగాలు, లాభాలను విద్యార్థులకు వివరించారు. అలాగే, మొక్కలు ఆహారాన్ని ఏ విధంగా తయారు చేసుకుంటాయి, తయారు చేసుకున్న ఆహారాన్ని ఎక్కడ దాచుకుంటాయి. పూత, కాయలు ఎలా తయారువుతాయి అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. వరి నారు ఎలా పోస్తారు. నాటు ఎలా వేస్తారు మొదలగు విషయాలను తెలియజేశారు. మండల విద్యాధికారి శంకర్ మాట్లాడుతూ.. ఇలాంటి క్షేత్ర పర్యటనలు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ, ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, అరుణ, ఉపాధ్యాయులు నవనీత, సునీత, జర్గయ, మల్లేశం, ప్రమీల, హిమగిరిజ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న అరుణ్ గురుస్వామి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతి ఏటా నిర్వహించే మహా పడిపూజను అరుణ్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ దంపతులు పాల్గొన్నారు. బొంతపల్లి గ్రామానికి చెందిన గణేష్, శ్రీనివాస్‌గౌడ్ గురుస్వాములు తమ 18వ మహా పడిపూజను పురస్కరించుకొని వేదమంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 18 మెట్లపై వెలిగించే పడిపూజను భక్తులు తన్మయత్వంతో తిలకించారు. జడల రమేష్ బృందం ఆలపించిన భక్తిపాటలు అందరిని అలరించాయి. పూజలో పాల్గొన్న స్వాములకు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఆనంద్ షెట్కార్, తదితరులు

నారాయణఖేడ్: పట్టణంలోని కరస్‌గుత్తి నుంచి కంగ్టి వరకు నిర్మిస్తున్న ఫార్మేషన్ రోడ్డు పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదేశాల మేరకు నారాయణఖేడ్‌లోని కాశీవిశ్వనాథ మందిరం వెనుక నుంచి మూడు కిలోమీటర్ల మేరకు ఫార్మేషన్ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు వల్ల పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. అలాగే, కంగ్టి మండలం ప్రజలకు బీదర్ వెళ్లే మార్గం సుగమవుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజేష్, మా జీ ఎంపీటీసీలు రామక్రిష్ణ, పండరిరెడ్డి, రాములు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

సంగారెడ్డి రూరల్: జిల్లాలోని నిరుద్యోగులకు బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హెట్రో ల్యాబ్ లిమిటెడ్ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. జాబ్ మేళాకి విద్య అర్హతలు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిగ్రీలో కెమిస్ట్రీ పాసై 25 సం.లోపు ఉండాలని సూచించారు. అభ్యర్థులు ధ్రువపత్రాలు జిల్లా ఉపా . ది కార్యాలయానికి బుధవారం ఉ.11 గంటలోపు హాజరు కావాలని కోరారు.

పాఠశాలలో స్పోర్ట్స్ కార్నివాల్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈఓ రాంబాబు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలోని వివేకానంద గ్లోబల్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం స్పోర్ట్స్ కార్నివాల్ నిర్వహించారు. పాఠశాల చైర్మన్ చిమ్ముల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఎంఈఓ రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్నివాల్‌ను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఇన్‌చార్జి ఎంఈఓ రాంబాబు సూచించారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతోందన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ నందిని రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడలను నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలో చదివే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: అంగన్‌వాడీ ఉద్యోగులకు తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ .. అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలకు డిసెంబర్ 15 దాటిన నవంబర్ జీతం రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ వేతనంతో అన్ని రకాల పనులు చేయిస్తున్న సకాలంలో వేతనం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. రెగ్యులర్‌గా వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు గడవలేని పరిస్థితి ఉందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు ఆరునెలల నుంచి గ్యాస్ బిల్లు, అద్దెకిరాయి, కూరగాయల బిల్లులు కూడా చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ అధ్యక్షురాలు శశికళ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయండి

సంగారెడ్డి(ఎడ్యుకేషన్): మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాయిలు మాట్లాడుతూ.. మిషన్ భగీరథలో కాంట్రాక్ట్ కార్మికులుగా 10 సంవత్సరాలుగా పని చేస్తున్న వారు నేటికీ కనీస వేతనానికి నోచుకోవడం లేదన్నారు. కాంట్రాక్టర్లు కార్మికులకు రూ.9 నుంచి రూ.11 వేల వరకు చెల్లిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనం రూ .26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ



పురంత స్వాముల నృత్యాలు



సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): ఆధ్యాత్మిక క్షేత్రం బర్దిపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో దత్తాత్రేయ జయంతి మహోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. సోమవారం స్వామివారి పల్లకీ సేవ ఊరేగింపు ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహరాజ్, డాక్టర్ సిద్ధేశ్వర స్వామిల ఆధ్వర్యంలో వైభవంగా సాగింది. గ్రామంలోని మహిళా భక్తులు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. దత్త నామ స్మరణ భక్తుల దండకాలు, పురంత స్వాముల నృత్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య సాగింది. కర్ణాటక రాష్ట్రంలోని చాంగ్లేర్కు చెందిన పురంత స్వాములు, కళాకారుల దండకాలు, నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ముగిసిన దత్త జయంతి బ్రహ్మోత్సవాలు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రం హత్నూర మాధుర గ్రామశివారులోని దత్తాత్రేయ క్షేత్రంలో గత వారం రోజులుగా నిర్వహించిన దత్త జయంతి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. సోమవారం ఉదయం దత్తాత్రేయస్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం సామూహిక సత్యనారాయణ వ్రతాల పూజలు చేశారు. పాచి బండ్ల ఊరేగింపుతో పాటు పల్లకీ సేవ ఊరేగించారు. గత వారం రోజులుగా దత్త నామస్మరణతో దత్తాత్రేయ క్షేత్రం మార్మోగింది.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

నారాయణఖేడ్: పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు సోమవారం నిర్వహించారు. హౌజింగ్ డీఈఈ సతీష్ తివారీ, ఏఈ సత్యనారాయణ ఖేడ్‌లోని వార్డు నంబర్ ఒకటిలో ఇంటింటికి తిరిగి ఇళ్లు లేని నిరుపేదల నుంచి వివరాలు సేకరించారు. లబ్ధిదారుల పేర్లు నమోదు చేసుకోవడం, అందుబాటులో ఉన్న స్థలాలను పరిశీలించడం తదితర సర్వే పనులు చేస్తున్నట్లు తెలిపారు.

ఊరూరా మరియమ్మ జాతరలు



జాతరలో పాల్గొన్న గిరిజనులు

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో మరియమ్మ, సేవాలాల్ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 54 గిరిజన తండాలు ఉండగా, ప్రస్తుతం 20 తండాల్లో మరియమ్మ, సేవాలాల్ మహరాజ్ జాతర ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పూజలు, అభిషేకాలు, పల్లకీ ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. ప్రతి రెండు రోజు ఒక్కో తండాల్లో జనవరి వరకు జాతర ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. మొగుడంపల్లి మండలంలోని మిర్జంపల్లి తండాల్లో సోమవారం ఘనంగా జారత ఉత్సవాలు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

◆ పాఠశాల తనిఖీ

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని నాగూర్ కే ఎంపీపీఎస్ పాఠశాలను ఎంపీడీఓ సత్తయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సమయపాలన పాటించాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా బడికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ శివాలయాల్లో ప్రత్యేక పూజలు

సంగారెడ్డి టౌన్ : ఆరుద్ర నక్షత్ర వేడుకల సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఆయా ఆలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకాలు, స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

◆ 'డబుల్ ఇళ్ల'కు నంబర్ల కేటాయింపు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి ఇప్పటికే వేలాది మంది రావడం జరిగిందన్నారు. ఇళ్లలోకి వచ్చిన వారికి ఇంటి నంబర్ ఇస్తున్నామని, అందుకు ఆధార్‌కార్డు, ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టా సర్టిఫికెట్, ఇంటి ఫొటో తీసుకొని రావాలని కోరారు. వాటిని ఆన్‌లైన్ చేసి ఇంటిపన్ను విధిస్తున్నట్లు తెలిపారు. దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొవాలని కోరారు.

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా మంగళవారం ఉ.10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. పట్టణంతో పాటు మండల పరిధిలోని నందికంది, పెద్దాపూర్, గొల్లగూడెం, నాగ్‌సాన్‌పల్లి, సిద్దాపూర్, రేజింతల్, కంబాలపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

◆ అభివృద్ధి పనులపై ఆరా



జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్ పర్సన్ రోజా సోమవారం పరిశీలించారు. 11వ వార్డు బీరప్ప బస్తీ, 22వ మల్లన్నబస్తీలో పర్యటించి అభివృద్ధి పనులపై ఆరా తీశారు. సీసీ రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీకాంత్ యాదవ్, ఏఈ కిష్టయ్య, సిబ్బంది ప్రశాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ రోడ్లు, పార్కులను కాపాడాలి

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపాలిటీలో రోడ్లు, పార్కులు, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కబ్జాదారుల నుంచి కాపాడాలని సోమవారం సీపీఎం పార్టీ నాయకులు నరసింహారెడ్డి, వివిధ కాలనీల అసోసియేషన్ నాయకులు హైడ్రా అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గతంలో హైడ్రా కమిషనర్‌ను కలిసి వందన పురికాలనీలో రోడ్లను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా అమీన్‌పూర్‌లో జరుగుతున్న అనేక అక్రమాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ విషయంలో స్పందించిన హైడ్రా అధికారులు రోడ్డుకు అడ్డంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించారని గుర్తు చేశారు. హైడ్రా అధికారులను కలసిన వారిలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆయకట్టుకు నీరు విడుదల

జోగిపేట(అందోల్): అందోల్ పెద్ద చెరువు నుంచి అందోల్ ఆయకట్టుకు యాసంగి సీజన్‌కు నీరందించాలన్నారు. అందుకు అవసరమైన పెద్ద కాల్వలను శుభ్రం చేయాలని మంత్రి దామోదర ఇరిగేషన్ అధికారులను ఆదేశించినట్లు అందోల్ మండల ఇరిగేషన్‌శాఖ ఏఈ మజర్ హుస్సేన్ తెలిపారు. సోమవారం ఇరిగేషన్ బంగ్లా వద్ద అందోల్ ప్రాంత రైతులతో తైబంధు నిర్ణయంపై సమావేశమయ్యారు. సోమవారం ఆయకట్టు సాగుకు నీటిని వదిలారు. సింగూరు ప్రాజెక్టు నుంచి ఈ ప్రాంతానికి యాసంగికి నీరు వచ్చే అవకాశం లేనందున పెద్ద చెరువు నుంచి నీరు వదిలేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఏఈ తెలిపారు.